నల్లమబ్బులు

డి. హనుమంతరావు

"సాయంకాలం అందంగా ఉంది" అనుకొంది జానకి అద్దంముందు నిలబడి. వేళ్లమధ్య జుట్టుపాయలు మెలికలు తిరుగుతున్నాయి.

అప్పుడే, ఓ జడి కొట్టి వెలిసి, యిళ్ళు, రోడ్లు చెట్లు అన్నిట్నీ స్నానం చేయించింది; నీరెండల కాంతుల్లో అంతా కొత్తగా వెలుగుతోంది.

ఇరవై ఆరేళ్లంటే ఎన్నిరోజుల ? మూడు వందల అరవై అయిదుపెట్టి గుణించాలి...ఎంత? ఎంతో నోట్లో కట్టుకలిగితే బాగానే ఉండును బ్రతుకు ! జాలిగా నవ్వుకొంది జానకి.

ఇన్నివేల రోజుల్లో, ఆ రోజు కో ప్రత్యేకత ఉంది. అలాంటి దింకొకటి యీ బ్రతుకులో మళ్లీ వస్తుం దని ఆమె అనుకోడంలేదు. ఎక్కువ ఆనందకర మైనదీ, ఎన్నటికీ మర్చిపోరానిదీ, ఏదో ఒక రోజు ప్రతివారికీ ఉంటుంది. జానకి జీవితంలో అలాం టిది, ఆ రోజే.

ఆ రోజు రకరకాల ఆలోచనలు ఒకదాని తర్వాత ఒకటి తొందర తొందరగా తోసుకొచ్చి ఏదో చెప్ప లేని సంతోషాన్ని కుమ్మరిస్తున్నాయి. ప్రపంచమంతా చాలా అందంగా, ఆనందంగా కనబడ్తోంది. రంగుల అందమైన పూల తోరణాలు ఎన్నో !— మనసులోనూ, బయటా ! రెండేళ్లలో ఎంతమార్పు!

రెండేళ్ల క్రితం పుట్టినరోజు పండగ బాధగా మూగగా ఏ వెలుగూ లేకుండా వెళ్లిపోయింది, అంత క్రితం చాలావాట్లిలాగే. అంతకన్నా ఎక్కువ నోచుకోలేదేమో అనే నిరాశ, నిస్పృహ అసలు పుట్టినరోజన్న ధ్యాసే రానీయకుండా దూరంచేశాయి.

జానకి పుట్టిన రెండేళ్లకి తల్లిపోయింది. తండ్రి పెంచి పెద్దచేశాడన్న మాటే గాని, ఆమె కో దారి చూపెట్టకుండానే జారుకున్నాడు. ఆ తర్వాత పదేళ్ల పాటు అక్కయ్య దగ్గర. ఆ పదేళ్లూ తన బ్రతుకు బాటల్ని ఏ పాడు గ్రహాలు తీర్చాయో—తల్చుకుంటే యిప్పటికీ గుండెల్నెవరో కోసినట్లుంటుంది. యీడొచ్చి యిన్నాళ్ళయినా పెళ్లి కాలేదని హేళనలు, పరిహాసాలు—వీటన్నిటితోనూ మగ్గి కుళ్ళడం కన్నా ఏ నుయ్యో గొయ్యో చూసుకోడం మంచిదని ఆ పదేళ్లలో ఎన్నిసార్లనుకుందో ! నాన్నమీద విప రీతమైన కోపంవచ్చేది. తను బ్రతికుండగానే ఎవరో ఒకరికి ముడిపెట్టకుండా నట్టనడి సంద్రాన లాగి యీ లోకంలో దిక్కెవ్వరైనా లేకుండా వదిలేసి తప్పుకున్నాడు !

పాపం, నాన్నమాత్ర మేం చేస్తాడు? బ్రతి కున్నంతకాలం ఎలాగోలాగ బావకే ముడెట్టాలని నానా తంటాలు పడ్డాడు. కాని,....మామూలు కథే! పేదరికం అడ్డొచ్చింది. అది పైకి చెప్పలేక, ఏదో వంకపెట్టి కాదన్నారు మామయ్యా, అత్తయ్యా. తను పుట్టిన నక్షత్రం మంచిదికాదట ! అదీ తను చేసిన పాపం !

"బావా ! ఎంత పిరికివాడివి కాకపోతే, నువ్వా భయాలన్నీ నమ్ముతావు ? యిప్పుడేమయింది ? అన్ని నక్షత్రాలు గుణించి కట్టుకొన్న పెళ్ళాన్ని క్షయాస్పత్రిలో జేర్పించి ఏం సుఖపడ్తున్నావు ? నాకు చేసిన అన్యాయానికి దేవుడు నీకు వేసిన శిక్ష యిది ?...."

జానకి కళ్లలో నిండిన నీటిపొరల్ని కొంగు కొసతో తుడుచుకొంది...ఏమిటో పాడు ఆలోచనలు !

"క్షమించు బావా ! యివాళ యెవరికీ కీడు తలపెట్టను. నీ కసలు ఎన్నటికీ తలవను. ఏదో క్షణంలో బాధ కలిగి అనుకున్నానంతే...నన్ను కాపాడిన దైవమే నీకూ మేలు జేస్తాడు....నా కేదన్నా లోపం జరిగితే, ఏదైనా తక్కువై, తృప్తి, ఆనందం దొరక్కపోతే—అప్పుడు, మరొకర్ని చూసి అసూయ

—50 వ పేజీ చూడండి

కడ్డం, బాధపడ్డం!.... ఆయన నీ అంత అందంగా ఉండకపోవచ్చు. అసలు ఆయనలో అందముందని నే ననను. కాని, ఆయన మనసు నీకన్నా, నాకన్నా, యింకా చాలామందికన్నా ఉత్కృష్టం !.... నిజా నికి నాఅంత అదృష్టవంతురాలుండదేమో అనుకుం టాను, నువ్వు నవ్వుకున్నా సరే!...." జానకి ఏవి టేమిటో చెప్పుకు పోతోంది, అద్దంలో తన ప్రతి ఫలాన్ని బావగా ఊహించుకొని.

"ఇవాళ నా యిరవైఆరో పుట్టినరోజు బావా! యివాళ ఆయనతో ఓ విషయం చెప్పాలని ఎన్నాళ్ల నుంచో ఉవ్విళ్లూరుతున్నాను.... కాని ఏమని చెప్పను ? ఎలా చెప్పను?.... ఒకోసారి ఆయన ముం దెలా అనుకుంటానో తెలుసా! నేనేదో పసిపిల్ల నయినట్టు, ఆయన నాన్నో, యింకెవరో పెద్దమనిషి అన్నట్టు అనిపించి ఏమేమో పసిపిల్లలాగే వాగు తాను.... ఆ తర్వాత అనిపిస్తుంది, ఆయన విసు క్కుంటారేమోనని!.... అంతా నా భయమే గాని ఆయన దేవుడు బావా! నేను బాధ పడ్తానంటే మొగంకూడా చిట్లించరు..... అవును, ఆయనకించు మించు నా వయసే ఉన్న కొడుకున్నాట్ట; నేను చూడ లేదనుకో ! అత నిక్కడుంటే నాలాగే మాట్లాడే వాడుగా ! అతనంటే ఎంత ప్రేమ ఆయనకీ ! ఒకోసారి, నిజం చెప్పాలంటే నాకు బాధకలుగు తుంది—యీర్ష్యఅన్నా తప్పు లేదేమో ! ఆయ నెప్పుడూ అతన్ని గురించే మాట్లాడతారు! ప్రతీ క్షణం ఆయన కళ్లముందు అతను మెదుల్తూంటా డన్పిస్తుంది."

జానకి కొసదాకా అల్లిన జడని బలంగా వెనక్కి విసిరి, రెండు చేతుల్తోనూ తడిమి చూసుకుంది. ఆరోజు తలంటుకొందేమో, వెంట్రుకలు సమంగా అణగకుండా అల్లిబిల్లిగా తిరుగుబాటు చేస్తున్నాయి. యిప్పటికి పదిసార్లు విప్పడం, అల్లడం అయింది— తృప్తి కుదరలేదు. మళ్లీ విప్పడం మొదలెట్టింది.

ఆరోజు ఆయన కా విషయం చెప్పాలని ఎన్నాళ్ల నుంచో ప్రయత్నం ! తీరా, ఆరోజు వచ్చాక, ఎలా చెప్పాలో తోచడంలేదు. అదాలోచించుకోవాలనే ఆయన్ని కాలేజికి పంపించింది. తన పుట్టిన రోజు కాబట్టి, సెలవుపెట్టి ఎక్కడో ఊరిబయట కొండ మీద దేవుడి దగ్గరకి తీసుకెళ్తామన్నారు! కాని, తనే యిప్పుడు కాదని పంపించేసింది. ఎలా ? ఎలా చెప్పడం ?

ఆయనకి పిల్లలంటే యిష్టమున్నట్టు కన్పిం చదు. ఎప్పుడో మాటల సందర్భంలో అన్నారు, "మనకి పిల్లలొద్దు, జానీ ! యిలా యెప్పటికీ యిద్దరమే ఉండిపోదాం. మనో ఒకడున్నాడు చాలదూ, జన్మ జన్మాలకీ సరిపడగా !"

నిజంగానే ఆయన కిష్టంలేదా! అందుకేనేమో, రెండుమూడు నెలల్నుంచీ అంత చనువుగా ఉండడం లేదు. ఏమిటోఆలోచిస్తూ కూర్చొనిపోతారు, గంటల తరబడి, పిల్చినా పలక్కుండా. అడగాలని నోటిదాకా వచ్చింది కాని, కాలేజీ విషయాలేమోనని సరిపెట్టు కూరుకుంది.

తను చెప్పకుండానే ఈ సంగతి గ్రహించా రేమో ! తెలుసుకోలేకపోవడానికంత అమాయకులు కారుగా! మనో కాకుండా వేరే తన కో పాప ఉండడం యిష్టంలేదా ఎందుకో !

నల్లమబ్బులు

8-వ పేజీ తరువాయి

జానకి మనసు ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో రెపరెపలాడింది.

సవతి గురించి, సవతి—కొడుకుగురించి, జానకి కేమీ తెలియదు. మూర్తి ఎంతసేపూ మనో గురించి మాట్లాడతాడు గాని, తల్లి గురించి ఏమీ చెప్పడు. ఎలా ఉండేదో తెల్సుకోడానికి యింట్లో ఒక్క ఫోటో అయినా లేదు! అక్కయ్య చెప్పడం—అతన్ని కన్నాక పదకొండురోజుల్లోనలే పోయిందని, అప్పట్నుంచీ అతను తాతగారి దగ్గరే పెరగడం.

ఎలా ఉంటాడో! తండ్రి ప్రేమ నింతగా పొందిన వాడు ఎంత అదృష్టవంతుడై యుండాలి? ఒక్కసారి చూడాలనిపిస్తుంది. కాని, ఆయనతో చెప్పడమెలా ? అతని కించుమించు తన వయసేట. తీసుకు రమ్మంటే ఆయన ఏమనుకుంటారో! ఏమిటో వెర్రి వెర్రి ఆలోచనలన్నీవచ్చి మనసు చెనకాడుతుంది.

పోనీ, మనో ఎంత గొప్పవాడైనా, తెలివైన వాడైనా, తనకి పిల్లలుండడానికీ, అతనికీ సంబంధ

శ్రీ రామయ్యగారు చని పోయిన కొన్ని రోజులలోనే భీమా కంపెనీవారు ఆయన భీమా చేసిన మొత్తం చెల్లించేశారు.

శ్రీమతి రామయ్యగారు కంపెనీవారికి తమ ధన్యవాదాలు పుతూ వ్రాశారు: "నా భర్త గారు చనిపోయిన కొన్ని రోజుల లోనే రావలసిన మొత్తం ఇచ్చే శారు. నిజంగా భీమా మంచి పెట్టుబడి."

ప్రేమకుమారి (బందరు)

మేమిటి? తన పిల్లలు అంత గొప్పవాళ్లు, అందగాళ్లు కాలేరనా ? లేకపోతే, అతని అదృష్టం వీళ్లకు పంచాల్సి వస్తుందనా ! జానకి ఆలోచనలకి ఓ అంతూ పొంతూ కుదరడంలేదు.

పెళ్లికాకముందు, ఆమె కోరిక ఒక్కటే. అది కాస్తా తీరాక, ఆ స్థానాన్ని మరోటి ఆక్రమించింది. మనో ఆస్తిలో వాటా కోరకుండా, పోనీ, ఆడపిల్ల అయినా సరె! తన బాధల్ని, సంతోషాన్ని, ఆశల్ని, ఆశయాల్ని విప్పి చెప్పుకోడానికి ఒక్క పాపాయి! జానకి కళ్లు చెమ్మగిలాయి.

"దానికి చదువు చెప్పించమనీ, పెద్ద కట్నాలు పోసి, పెద్దసంబంధాలు తెచ్చి పెళ్లిచెయ్యమనీ బాధపెట్టను!.... కాని నాది అని చెప్పుకోడానికి ఒక్కపాప !" యింతకన్నా ఈ జన్మకింకేం కోరదు! జానకి దేవుణ్ణి బ్రతిమలాడింది, కళ్లనీ చెంపల్నీ తుడుచుకొని.

ఆరోజు నాలుగ్గంటలకే మొగమంతా శుభ్రంగా కడిగి కళ్లనిండా దట్టంగా కాటుక పట్టించింది. ఈ నీళ్లన్నీ కారి, అదంతా చెంపలమీదికి పాకింది; తుడవడంతో మరీని ! ఆయన చూస్తే ఏమనుకుం టారో ! ఏడుస్తోందనుకుంటారేమో !

జానకి గబగబా పంపుదగ్గరకి పోయి, మళ్లీ మొగం కడిగి, తిరిగ్గా కాటుక, బొట్టూ తీర్చింది. ఒకొక్కొక్కరోజు అన్నీ చక్కగా అమరుతాయి, వాటంతటవే; తనెంతో అందగత్తెనని మురిసి పోతుంది. కాని, అదేమిటో, తీరా, తను అందంగా తయారవుదామనుకునేప్పటికి అంతా వక్రంగా తయారవుతుంది — 'ఫర్వాలేదు' అనుకో డానిక్కూడా వీల్లేకుండా ఈ జడొకటి ! ఎన్ని సార్లు అల్లినా, ఎత్తులు పల్లాలు, వంకరలకింద తయారైంది.

అయిదున్నర కావస్తోంది. యింకా రారేం! జానకి మనసు ఆలోచనల్లోపడి ఆలస్యమయిందన్న సంగతి గమనించలేదు అంతవరకూ. బయటకొచ్చి చూసింది.

దూరంగా మెట్లమీదనుంచి మూర్తి దిగు తున్నాడు; వెనక ఆకాశం తప్పించి ఏం కనబడదు. ఎత్తైన విగ్రహం, బూడిదరంగు సూటు, నల్ల ఫ్రేం—కళ్లద్దాలు, చేతిలో గొడుగు, వయ్యారంగా నడక—జానకి మెదడ్లో ఆ బొమ్మ అచ్చుగుద్ది నట్టు, ఎప్పుడు తల్చుకున్నా కనబడుతుంది.

ఈ రోజు, రోజూలాంటిదికాదు. ఈరోజు అంతా యిదివరకట్లా జరగదు.... పైగా యింత ఆలస్యంగా రావడమేం? జానకి గబగబా వెళ్లి మంచం మీద, గంటల తరబడి గాఢ నిద్రపోతున్నట్టు పక్కంతటినీ వంకర టింకరగా రేపేసి పడుకొంది.

లోపలికొచ్చి చూశాడు మూర్తి.

ప్రపంచంలో అంతా మంచి తప్పించి చెడే లేనట్టు ప్రశాంతంగా మూసుకున్న కళ్లు, చిరునవ్వు విరిసిన పెదిమలు,— మూర్తికి లేపబుద్ధికాలేదు. మంచం మీద వారగా చేతినవతల పట్టె కానించి కూర్చొని అట్లా ఆమెకేసే చూస్తుంటే ఎన్ని క్షణాలు గడి చాయో తెలియదు. చెవుల్ని కప్పినజుట్టు నెమ్మదిగా వెనక్కి తోశాడు. కళ్లకింద ఎత్తుగా లేచిన భాగంలో, కనురెప్ప—వెంట్రుకల నీడలు పడినచోట మృదువుగా పెదాల్తో స్పృశించాడు, ఆమె లేస్తుందనే ఆశతో. జానకి కదిలి యిటునుంచి అటుతిరిగింది, కాని లేవ లేదు.

"అదుగో, మళ్లీ మొదలెట్టారు !" జానకి ఉలిక్కిపడ్డట్టు కళ్లు తెరిచి కోపంగా చూసింది, జడవిప్పుతున్న మూర్తివంక.

"నిద్ర పోడంలేదన్నమాట, దొంగా !"

జానకి నవ్వేసి, వళ్లో తలపెట్టుకుంది; మూర్తి నెమ్మదిగా జుట్టంతా మొగంమీద పరుస్తుంటే బొమ్మలా కళ్లుమూసుకుని.

"యివన్నీ నల్లమబ్బులు, పేటివాటు చంద మామ ఇదీ !"

"ఛా! మరీ పుస్తకాల్లో రాసినట్టు!" సిగ్గు పడింది జానకి.

"యివాళ నీ పుట్టినరోజుకి, ఓ మంచివార్త జానీ, చెప్పమంటావా ?"

"నేనూ చెప్తానో మంచివార్త."

"ముందర నన్ను చెప్పనీ."

"కాదు, నేను చెప్పాలి." పెంకిగా అంది జానకి, మూర్తికూడా పట్టుపడతాడని ఆశించి. కాని ఆమె ఆశ నెరవేరలేదు.

"ఊఁ, చెప్పు." అన్నాడు మూర్తి.

జానక్కి వెంటనే ఏం చెప్పాలో తెలియలేదు.

కాస్సేపటికి నెమ్మదిగా అంది, బోర్లా తిరిగి తల అతని ఒళ్లో దాచుకుని—

"మనోకి తమ్ముడో, చెల్లాయో! .... ఇంకా నాలుగు నెలల్లో!"

ఆమె తలలో బుజ్జగిస్తున్నట్టు కదిలిన వేళ్లు ఒక్కసారిగా ఆగిపోయాయి. మూర్తి మాట్లాడలేదు., కదల్లేదు. ఇద్దరూ అలాగే ఉండిపోయారు చాలాసేపు.

ఎంతో ఆశించింది, ఏమేమిటో ఊహించింది. అతనా మాట వినగానే అలా గడ్డకట్టుకు పోతాడని మాత్రం అనుకోలేకపోయింది. ఈ ఘోర వార్త వినాల్సి వస్తుందని ఎప్పట్నుంచో భయపడుతున్నట్టు, ఇప్పటికిలా పాపం పండి శిక్ష పడినట్టు మాట లేకుండా, నిశ్చలంగా గది మూలకేసి చూస్తూ కూర్చుండిపోయాడు మూర్తి.

ఎంత నిరాదరణ! నరకం! పెల్లుబికి వచ్చే దుఃఖాన్ని కష్టంమీద ఆపుకుంటూ, రోషంగా లేచి కూర్చుని అటు తిరిగింది జానకి.

"అయితే, నువ్వక్కడికెళ్లాలా? ఇక్కడే తీసుకుంటావా?" గోడతో మాట్లాడుతున్నట్టు అడిగాడు.

"నిన్న అక్కయ్య ఉత్తరం రాసింది. రేపో యెల్లుండో బావకూడా రాస్తాట్ట!" అలాగే సమాధాన మిచ్చింది, జానకి.

"ఏమని?"

"ఓ వారం రోజుల్లో మంచిరోజు చూసుకుని నన్నక్కడికి రమ్మని. ఇక్కడ బండెక్కిస్తే అక్కడ బావ వచ్చి తీసుకెళ్తాడు."

అంతా ముందే నిర్ణయించేసినట్టు చెప్పింది జానకి. అంత త్వరగా వెళ్లాలనుకోలేదు అసలు. అక్కయ్యకి అప్పుడే రానని రాయాలనుకొంది. కాని, ... అనుకున్నట్టేదీ జరగదు. ఆయన ధోరణి సహించి ఉండటం కష్టం. కొన్నాళ్లయినా ఎక్కడికో వెళ్లిపోవాలి. ఇక్కడ్నుంచి వెళ్లిపోయి, సుఖపడుతుందని కాదు; అయినా తప్పనిసరి .... పాపని చూశాకయినా మనసు మారుతుందేమో! .... జానకి క్షణాలమీద ఒక నిశ్చయానికి వచ్చేసింది.

"ఏదో చెప్తామన్నారు!" అరగంట అలాగే కూర్చొన్నాక వినపడీ వినపడనట్టు నెమ్మదిగా గుర్తు చేసింది.

"ఏంలేదు, ఇక అది కుదరదులే" మూర్తి నిర్లిప్తంగా అని, ఆమెకేసి చూడకుండానే, బట్టలు మార్చుకొని బయటికెళ్లిపోయాడు, యిప్పుడే వస్తానని. ఇక మాటలు పొడిగించలేకపోయింది.

ఆయనలో ఏదో చీకటి మూల ఉంది. దానిమీద కాంతి పడేలా సూచనేదీ చెయ్యడంలేదు. తనూహించే కారణాలన్నీ ఆయనకి తనంటే ఏవో నీచమైన అభిప్రాయా లున్నట్టు చిత్రిస్తున్నాయి. కేవలం ఆయన అవసరాలు తీర్చుకోడానికే తెచ్చుకున్నారా, తనని! .... మెదడంతా పెద్ద ప్రయోగశాలలా తయారైంది. ఒక్కొక్క ఆలోచనా, ఎన్నో ముళ్లు గుచ్చి ఎంతో బాధనీ, దుఃఖాన్నీ మిగిల్చి వెళ్లిపోతుంది. ఏదీ తేలదు. తేల్చుకోవాలనే ఆరాటం మాత్రం క్షణక్షణానికి ఎక్కువగా క్షోభ నింపుతోంది.

జానకి గుండెల్ని ఎవరో కొలిమి తిత్తులు—చేసి, ఊదుతున్నట్లుంది. ఆ రోజల్లా కళ్లలో నీరు ఇగిరిపోతుందన్నట్టు ఏడ్చి ఏమీ తేల్చుకోలేకపోయింది ఆమె.

ఆ వారం రోజులూ ఒకర్నొకరు తప్పేదో చేసినట్టు, తప్పించుకు తిరిగారు. మాటలు బొత్తిగా తగ్గిపోయినై.

* * *

ఓ బల్లమీద కిటికీవార కూర్చొంది జానకి.

"కళ్లలో నిప్పురవ్వలు పడతాయి, ఇటుపక్క కూర్చో." మూర్తి ప్లాట్‌ఫారంమీద నిలబడి ఎదురు కిటికీలోంచి బయట గూడ్సుపెట్టెలకేసి చూస్తూ అన్నాడు. జానకి మాట్లాడలేదు, కదల్లేదు. ఇన్నాళ్లనుంచీ పేరుకున్న విచారమంతా ఒక్కసారి రెండింతలయినట్లుంది, ఇద్దరికీ. ఇద్దరూ ఏదో ఘోరమైన నేరం చేసినట్టు బాధపడ్డారు.

బండి కదిలింది, పెద్దగా రొదచేసి.

"నేను వెళ్తాను" మూర్తి తల వొంచుకుని గిరుక్కున తిరిగి గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయాడు, తన మొగం ఆమెకి చూపడం ఇష్టంలేనట్టు.

కోర్టులో కేసు విచారణ జరుగుతోంది. ప్రాసిక్యూషన్ లాయర్ గారు తమ 'వాదన' ముగించి కూర్చున్నారు. జడ్జిగారు, వెంటనే "డిఫెన్సు లాయర్ మాట్లాడక్కరలేదు! ప్రాసిక్యూషన్ జయించినట్లే" అనేశారు.

డిఫెన్సు న్యాయవాది కంగారు పడిపోయి, తన వాదన కూడా వినవలసిందని ప్రాధేయపడ్డాడు, జడ్జిగారు ఏలాగయితేనేమి ఒప్పుకున్నారు. డిఫెన్సులాయరుగారు కూర్చోగానే న్యాయాధిపతి ఆశ్చర్యపడిపోతూ "అరే! ప్రాసిక్యూషన్ దే కేసనుకుంటే మీదే నెగ్గిందే!" అన్నారు.

అరుణి (ఉదయగిరి)

జానకి గాజుపొరల్లాంటి నీళ్లు నిండిన కళ్లతో కనబడేంతవరకూ అతనివంకే చూసింది. ఆఖరిసారి దూరాన్నుంచయినా తనవంక చూస్తాడేమోనని! కాని, తనేం పాపం చేసిందో! పోనీ అంత ఇష్టం లేకపోతే అసలీ స్థితి రాకపోయే మార్గమేదన్నా చూసినా బాగుణ్ను!

చెట్లూ, చేలూ, ఇళ్లూ, మనుష్యులూ అన్నీ ఎంతో వేగంగా వెనక్కి వెళ్లిపోతున్నాయి. అమితమైన వేగంతో దూసుకుపోతూంది రైలు, కొన్ని స్టేషనలో ఆగకుండా. రైలు ఆగనిచోట ప్లాట్‌ఫారంమీద చెట్ల ఆకులు, కాగితాలు, దుమ్ము—అన్నీ కలిసి పైకి రేగి గాలిలో ఎగురుతున్నాయి. అలుక్కుపోయినట్టు, ఒక్కటీ సరిగ్గా, స్పష్టంగా కనబడకుండా; ఆమె మనసులో ఆలోచనల్లాగే. జానకి తల వెనక్కి విరాగిలా ఆనించి అటే చూస్తోంది.

మనో! ఎంత అందమైన పేరు! అంత చక్కటి పేరు పెట్టాలనిపించాలంటే, అతనెంత అందగాడై ఉండాలో! జానకి మనసులో ఒక ఆకారం వెలిసింది—ఆరడుగుల విగ్రహం, నాజూగ్గా, సన్నగా. నొక్కులు తిరిగిన జుట్టు; పసివాడిలా అమాయకంగా నవ్వే నోరు; వినయంగా చూసే కళ్లు.

తెల్లని చిక్కటి పాలలా వెలిగే తన జీవితంలో విషం విదిపి నల్ల మరకలు చేశాడు మనో. మనో లేకపోతే తన పాపకోసం ఎంత ప్రేమతో, ఆత్రంగా ఎదురుచూశేవారు ఆయన! ఇప్పుడు తన పాప అతనిలా ఉండదనేగా ఆయన భయం! లేకపోతే మనోకి పోటీగా మరో వారసు డొస్తాడనా! అంత నీచమా ఆయన ఆలోచన! .... కాని, నీచమేముంది? సహజమేనేమో!

రైలేదో స్టేషన్లో ఆగింది. ప్లాట్‌ఫారంమీద ఎవరో దంపతులు. తనలాగే పురుటికి వెళ్తున్నట్టుంది. ఆమె సామాన్లన్నీ రెండు చేతుల్లోనూ, చంకల్లోనూ ఇరికించుకొని పక్కగా నడుస్తున్నాడు మొగుడు; ఆ ఫ్లాస్కు ఒక్కటే ఆమె పట్టుకుంటే అలిసిపోతుందని భయపడుతున్నట్టు! వాళ్ల వంకే తదేకంగా చూడసాగింది జానకి. తనున్న పెట్టెలోకే వస్తున్నారు.

"జాగ్రత్త. రాత్రులు ఎక్కువగా మేలుకు ఉండదు. బరువులు ఎత్తడానికి ప్రయత్నించకు. జాగ్రత్త. ఇంట్లోవాళ్లెవరికోసమో కనిపెట్టుక్కూర్చోకు; నువ్వు సరిగ్గా ప్రొద్దున పదింటికి, రాత్రి ఎనిమిదింటికీ తినేసి నిద్రపో; జాగ్రత్త. నిన్న తెచ్చిన మందు రోజూ రెండు పూటలా అన్నం తిన్న వెంటనే మర్చిపోకుండా తాగు ....." అతనలా అందరిమధ్యా గట్టిగా మాట్లాడుతుంటే, సిగ్గుతో తలొంచుకుని గబగబా రైల్లో ఎక్కేసిందామె.

ఎన్నిసార్లు అంటున్నాడో "జాగ్రత్త" అని! పది, పదకొండు .... జానకి లెక్కబెట్టింది. రైలు కదలినా, ప్లాట్‌ఫారం అయిపోయేదాకా కూడా కిటికీ కమ్మీ పట్టుకుని పరుగెట్టి జాగ్రత్తలు చెబుతూనే ఉన్నాడు. వేగం హెచ్చాక ఇంక అందుకోలేక, దిగబడిపోతూ, "నే నిచ్చిన ముప్పై కవర్లూ వారానికి రెండు చొప్పున ప్రతీ ఆదివారం, లక్ష్మివారం రాసి పడెయ్యి, జాగ్రత్త!" అని ఆఖరుసారిగా కేకబెట్టాడు. రైలు కదిలి ఎంతోదూరం వచ్చి, తెల్లని మచ్చలా అతనక్కడ నిలబడిపోవడం చూస్తూనే ఉంది జానకి.

ఒక్కసారి నవ్వొచ్చింది, ఆ అమాయకత్వానికి. కాని, వెంటనే నీడలాగ, మూర్తి తనకిచ్చినవీడ్కోలు మనసులో మెదిలి బాధపెట్టింది. ఆమె ఎంత అదృష్టవంతురాలో!

"పాపం, అతనంత యిదిగా చెబుతోంటే మాటే పలకవేమమ్మా" ప్రక్కామె ఎవరో అడిగింది నవ్వుతూ.

"ఏం చెప్పను, చెప్పండి. యింటిదగ్గిర రోజూ నెల్లాళ్నుంచి పాఠం అవుతూనేఉంది. అక్కడికి వాళ్లంతా ఎవరో రాక్షసులన్నట్టు, తమరొక్కరే మనిషన్నట్టు చెప్పుకొస్తారు. మరీ వేలంవెర్రి! చాదస్తం!" అమ్మాయి ముచ్చటగా విసుక్కొంది.

"వెర్రేమిటమ్మా! ఆమాత్రం అభిమాన

మున్నవాళ్ళ ఎక్కడో నూటికీ, కోటికీ !" నిట్టూర్చింది పక్కావిడ.

జానకి ఆ మాటలు తన కన్వయం చేసుకుని చురుక్కున ఆమెవంక తిరిగి చూసింది. పెట్టెలో కెక్కగానే తనేవో ఆలోచనల్లమధ్య యిరుక్కుని, లోపలెవరు ఎక్కుతున్నారో, ఎవరు దిగుతున్నారో సరిగ్గా గమనించలేదు.

ఆ మూల ఎవరో ముసలాయన, పొడుంపీల్చే ట్టున్న ముక్కు, అసలు వెంట్రుకే లేని బట్టతల! ఆయన కెదురుగ్గా ఒకతను; వయస్సెంతుంటుందో చెప్పడం కష్టం. అష్టావక్రంగా ఉన్నాడు. "పాపం, నవ్వకూడదు." అని చెంపలేసుకుంది జానకి ఆ ఆకారాన్ని చూసి నవ్వొచ్చినందుకు తనని తానే తిట్టుకొని. ఆ తర్వాత ఎవరో పల్లెటూరు మోతుబరి పెద్దచుట్ట వెల్గించి, అసలు ఈ రైలు, ఈ లోకం అంతా ఎలా నడుస్తున్నాయా అని ఆలోచిస్తున్నట్టు తల పైకెత్తి దూరంగా ఎక్కడో ఆకాశంలోకి చూస్తున్నాడు, అదే పనిగా. ఎదురుగ్గా, ఈ కబుర్లుచెప్పే ముసలావిడ. ఆ పక్కన ఆ అమ్మాయి. ఆ అమ్మాయి బాగా ముగ్గురికి సరిపడే స్థలం ఆక్రమించింది. హోల్డాలు పొడుగునా పరిచేసి, ఎవరొచ్చి అడిగినా చుట్టవద్దని చెప్పి మరీ వెళ్ళాడు మొగుడు. కాళ్ళు కిందకి వేలాడేస్తే నొప్పెట్టాయని పెద్దపెట్టె ఒకదాన్ని బల్లకిందికి తోయకుండా అడ్డంగా దార్లో పెట్టాడు. ఒకవైపు పెద్ద మరచెంబు, చామంతిపూలు, మరువం. మరోపక్క బత్తాయిలు, పత్రికలు— అంతా మహారాణిలా పకడ్బందీగా ఉంది వ్యవహారం.

ఆ పక్కనున్న ముసలామె అమ్మాయితో కబుర్లు కలిపేసింది. వాళ్ళిద్దరూ ఆత్మీయులైపోయారా కాసేపట్లోనే. ఆ పెట్టెమొత్తానికి తను కాకుండా, వాళ్ళిద్దరే ఆడవాళ్ళు. వాళ్ళతో మాట్లాడకపోతే తనింక మూగనోము పట్టాల్సిందే. జానకి వాళ్ళకేసి చూసి మాటలు శ్రద్ధగా వింటోంది. అలా చేస్తేనన్నా కాసేపటికి వాళ్ళంతట వాళ్ళే తనతో మాటలు కలుపుతారనే ఆశతో.

"ఏ ఊరు వెళ్ళాలమ్మా మీరు!" జానకి కోరిక ఫలించి ముసలామె అడిగింది.

ఆ తర్వాతి ఎన్నో ప్రశ్నలు ఆమె గురించి, తల్లి, తండ్రి, అక్క, బావ, మొగుడు, ఊరు, ఉద్యోగం గురించీ.. జానకి అన్నిటికీ సమాధానాలు ఓపిగ్గా చెప్పుకొచ్చింది.

"అయితే నువ్వు మా మూర్తి రెండో పెళ్ళానివన్నమాట !" ముసలామె ఆశ్చర్యం, ఆత్రం, ఉత్సాహం, ఉద్రేకంలాంటి భావాలెన్నో మిళతమైన స్వరంలో పరిస్థితిని సూక్ష్మంగా తేల్చేసింది.

జానకి అంగీకారంగా తల దించుకొంది.

"ఇదుగో చూశారా ! ఈవిడేట మూర్తి రెండో పెళ్ళాం!" ముసలామె, దూరంగా కూర్చొన్న బట్టతల మొగుడివంక చూసి అరిచింది. ఆయన హఠాత్తుగా యిటు తిరిగి ఈమెవంక అదే పనిగా చూడసాగాడు.

జానకి ఊహించని కలయిక అది. చాలా అయోమయంగా అసంబద్ధంగా కనబడింది.

"ఇదుగోరా, అబ్బాయి, పిన్ని !" ముసలామె మూల అబ్బాయిని చూసి అంది.

"ఏదీ! ఏదీ! నా పిన్నే! నా పిన్నే! పిన్నంటే ఎవరే అమ్మమ్మా !" వెంటనే ఎగిరొచ్చి పక్కన కూలబడ్డా డతను.

నల్ల మబ్బులు

"మీ నాన్న రెండో పెళ్ళాం !"

"నాన్న—పెళ్ళామా! యెంత బావుందో! అయితే ఇంక రేపట్నుంచి నేను, నాన్న—పెళ్ళాం జత. నీతో మాట్లాడితే ఒట్టు !..."

ఏమిటో అరుస్తూ వెంటనే సీటు మార్చి జానకి పక్కన జేరాడు. ముసలామె కళ్లలో నీరు చిమ్మింది.

"ఒరేయ్ వెధవా, ఇటు రా ! నిన్నిక్కడ నోరు మూసు కూర్చోమంటే, అక్కడ కెందు కెళ్ళావు?" ముసలాయన ఆ మూలనుంచి అరిచాడు.

"బాబోయ్ ! బాబోయ్ ! నేను రాను. పిన్నీ, నన్ను నీతో కూడా తీసుకుపో. తాతయ్య చంపేస్తాడు !" జానకి చేతిని గట్టిగా పట్టుకొని ఏడుస్తున్నట్టు అరుస్తున్నాడు కుర్రాడు.

"రా, బాబూ. తప్పు. నీకు తాయిలం పెడతా" చేతులు చాచి లాక్కొంది ముసలామె.

జానకి కేదో కలలో ఉన్నట్టుంది.

"వీ డీ లోకంలో పడి, దాన్ని సాగనంపాక యిరవై యేళ్లయింది..... పుట్టింం తర్వాత ఒకసారి వచ్చి చూశాడు; ఆ తర్వాత పదేళ్లకో ఎప్పుడో మళ్లా

మామగారు: ఏం బాబూ! రేపుకదా పండుగ. నేడే వచ్చావ్!

అల్లుడు: రైలుబళ్లు మామూలుగా లేటుగా వస్తాయనుకున్నాను.

ఆదిశేషు (కైలాసపురం)

ఒకసారి చూశాడు. అంతే. ఇంక మళ్లీ ఇటువైపే రాలేదు .... నెలనెలా వందలు పంపిస్తాడు; అవి కొనండి, ఇవి కొనండి అంటూ ..... ఎందుకు ? ఆమాత్రం డబ్బు మాకు లేకనా ? తనొకసారి వచ్చి చూసిపోతే, వాడికి తండ్రిని చూసినట్టు ఎంత తృప్తి ఉండేది ! తండ్రి అన్నాక అంత మాత్రమైనా చెయ్యలేకపోతే, ఎందుకు ఉండి మత్రం" ముసలామె స్వగతంలోలాగ చెప్పుకుపోతోంది.

"ఆయనస్తమానం, మనో, మనో అంటూ కలవరిస్తూనే ఉంటారు !"

"ఆమాత్రం గుర్తున్నాడన్నమాట ! అంతే చాలు .. ఎవడో మన్మధు డవతరిస్తాడని ఇద్దరూ ఏమేమిటో ఊహించుకుని ముందుగానే పేరు పెట్టుకున్నారుట, 'మన్మోహన్' అని ! అది కాస్తా యిలా తేలింది! .... అది ఆ బాధతోనే బెంగెట్టుకొని ప్రాణాలు ఒదిలిందా ! తనిలా దూరమయితే, ఇంక వాడి గతేం కాను, మా తర్వాత !" ముసలామె కళ్ళు కడవలయ్యాయి.

జానకి అతనివంక పరిశీలనగా చూసింది. ఇరవై యేళ్ల మనిషికి తగినట్టు కళ్ళు, ముక్కు, నోరు పెరిగాయి గాని, నుదురు, తల పైభాగం పెరగ లేదు. ఒక కన్ను చిన్నది, మరోటి పెద్దది. రెంటికీ మెల్ల. నెత్తిమీద వెంట్రుకలు అక్కడక్కడ చాలా పల్చగా అసహ్యంగా ఉన్నాయి. చేతులు, పొట్ట సమంగానే ఉన్నాయి గాని, కాళ్ళు ఒకటి పొట్టి, రెండోది పొడుగు. పైగా వంకర పోయాయి. ఈ వక్రాలు చాలవన్నట్టు, తుట్టు పెదిమలు, చొంగ కార్చే నాలిక బయటపెడూ వెకిలి మాటలు ! యేళ్లతోబాటు శరీరంలో భాగాలు, మెదడూ సమంగా పెరగలేదు.

జానకి చూడలేక తల తిప్పుకొంది.

"అతగాడ్లో ఉన్నవే, యివన్నీ. ఎక్కడికి పోతాయి పోలికలు ! ఏ డాక్టర్నడిగినా అదే మాట! సంప్రదాయం తండ్రినిబట్టి వచ్చింది, చేయగలిగిందేం లేదని ! అతగాడిలో స్పష్టంగా కనబడని వన్నీ వీడిలో మరింత కొట్టొచ్చినట్టు తయారైనాయి ! అంతే తేడా ! అందుకే అతగాడికి వాణ్ణి చూడ్డానికి మొహం చెల్లదు. తన ప్రతిబింబమేగా !" ముసలాయన ఆవిడతో అంటున్నట్టు అన్నాడు, జానకి వినాలని. స్వరం కోపంతో కంపిస్తున్నట్టుంది. ముసలామె చేసిన ఏదో సంజ్ఞ అర్థంచేసుకున్నాక ఆయన మాటలు ఆపి, అటు తిరిగాడు

మూర్తికి నుదురు విశాలంగానే వెనక్కి ఒరిగినట్లుంటుంది. ఒక కన్ను కొద్దిగా మెల్ల. ఒక కాలు పొట్టయితే కావచ్చు. కాని నడక కుంటుతున్నట్టుండదు. పైగా అదో షోగ్గా ఉంటుంది. జుట్టు పల్చనే—జానకి మూర్తికీ, పిల్లాడికీ పోలికలు వెతుక్కుంది.

ఒక తుఫాను చెలరేగి సద్దుమణుగుతూం దనుకునేంతలో మరోటి లేచింది; జానకి హృదయంలో. పాత మబ్బులన్నీ దూరంగా పోయి, కొత్త కొత్తవి జేరుకుంటున్నాయి. ఈ ఆలోచనలు చేసే అలజడిలో గడ్డిపోచలా తనెటో కొట్టుకుపోడమే గాని, ఏదీ స్పష్టంగా కనబడదు, ఇదమిత్థంగా తేలదు.

కాని, ఇంతదాకా గుండెలమీద బలంగా కూలబడిన బండ ఏదో దించినట్లుంది. తేలికైనట్లనిపించి, హాయిగా ఊపిరి సలిపింది జానకి.

బండి ఆగింది. అక్కయ్యా, బావని చూడగానే ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం వచ్చాయి. అక్కయ్య నిజానికి అందరు అక్కల్లాంటిదీ కాదు. అమ్మ ఉంటే ఎలా చూసేదో తెలియదు గాని, ఒక్కోసారి "అమ్మా" అనే పిలవాలనిపిస్తుంది అక్కయ్యని. బావ! వెర్రిబావ! తన ఇంట్లో ఉన్నందుకు ఎక్కడ బాధపడుతుందోని అతిగా ఆదరించి గారాబం చేసేవాడు. జానక్కి లోకమంతా దేదీప్యమానంగా వెలుగుతున్న ట్లనిపించింది.

"వెళ్తానండి. ఈసారి నే నక్కడికి వెళ్ళాక, ఆయనకి నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తాను, తప్పకుండా. ఆయన మీ రనుకునేంత రాయి కాదు." జానకి ముసలి దంపతులకి భరోసా యిచ్చి, మనో చేతిలో ఓ పది రూపాయల నోటు పెట్టింది, పెద్దవాళ్లిద్దరూ వద్దంటున్నా వినకుండా.

రెండు రోజుల తర్వాత, ఇంటికి క్షేమంగా జేరినట్టు మూర్తికి ఉత్తరం రాస్తూ జానకి చివర చేర్చింది.

"మిమ్మల్ని భయపెట్టేవన్నీ ఉత్తి నల్లమబ్బులు. నల్లమబ్బులు ఉరుముతాయి గాని, వాన కురవ్వు. నే నిక్కడ కోవెల్లో స్వామివారి దర్శనం చేసుకున్నాను. ఆయన మాటకి తిరుగుండదని అంతా గట్టిగా నమ్ముతా రిక్కడ ..... పండు లాంటి కొడుకు నెత్తుతావని దీవించారు స్వామివారు."